క్లుప్తంగా

కొమ్మనాపల్లిలో చీఫ్ ఇంజినీర్ పర్యటన


తొండంగి మండలం కొమ్మనాపల్లిలో మహిళతో మాట్లాడుతున్న సీఈ గాయత్రి

తొండంగి: డయేరియా ప్రబలిన నేపథ్యంలో కొమ్మనాపల్లి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ టి.గాయత్రి మంగళవారం పర్యటించారు. గ్రామంలో పర్యటించి అనారోగ్యం నుంచి కోలుకున్న రోగులను పరామర్శించారు. డయేరియా ప్రబలడానికి కారణాలపై ప్రజలను ఆరా తీశారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చీఫ్ ఇంజినీర్ చెప్పారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు, కలుషితం కాకుండా పైపులైన్లను పరిశీలించి, మరమ్మతులు చేసి, స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగుల పరిస్థితిపై వైద్యాధికారి పి.రవికుమార్, ఇతర వైద్యులతో చర్చించారు. ప్రస్తుతానికి కేసుల నమోదు సంఖ్య తగ్గిందని వివరించారు. అదేవిధంగా బెండపూడిలో ఆమె రోగులను పరామర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎస్‌ఈ శ్రీనివాసరావు, ఈఈ భారతి, డీఈ రాంబాబు, జేఈ అనూష తదితరులు ఉన్నారు.

గర్భిణులకు భోజనం పంపిణీ


గర్భిణులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న డాక్టర్ సౌమ్య

ప్రత్తిపాడు: దూర ప్రాంతాల నుంచి ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కు మంగళవారం ఆరోగ్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు భోజనం సమకూర్చారు. మండలంలోని శరభవరం గ్రామ ఏజెన్సీ మిషనరీ పాస్టర్ అల్లు సామ్యూల్ శ్రీనివాస్ వీటిని సమకూర్చారు. సుమారు 50 మంది గర్భిణులకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య భోజనం ప్యాకెట్లు అందజేశారు.

వీరవరం పెద్దాచార్యులు మాస్టారు అస్తమయం


గుడిమెళ్ల సీతారామాచార్యులు(ఫైల్)

ప్రత్తిపాడు: విద్యా రంగంలో వీరవరం పెద్దాచార్యులు మాస్టారుగా పిలువబడే గుడిమెళ్ల సీతారామాచార్యులు (90) ప్రత్తిపాడులోని ఆయన స్వగృహంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుదీర్ఘ కాలం పాటు విద్యా వృత్తిలో కొనసాగిన ఆయన అనేక మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. వీరిలో ఎందరో డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, ఉన్నతోద్యోగులుగా స్థిరపడిన వారే. ప్రముఖ రాజకీయ నాయకులు కూడా వీరి వద్ద విద్యాభ్యాసం చేసినవారున్నారు. ఈయన రాజపూడి, ప్రత్తిపాడు, వీరవరం తదితర గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. పెద్దాచార్యులు మాస్టారుగా పేరొందిన గుడిమెళ్ల సీతారామాచార్యులు మృతికి పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

ఆర్సీఎం స్కూలు మూసివేత


మూతపడిన ప్రత్తిపాడు ఆర్‌సీఎం పాఠశాల

ప్రత్తిపాడు: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి స్థానిక ఆర్‌సీఎం సెయింట్ జోసెఫ్స్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మూసివేశారు. పాఠశాలను నిర్వహించలేక యాజమాన్యం ఈ స్కూలును మూసివేసినట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. విశాఖ ఆర్‌సీఎం యాజమాన్యం 1956–57లో ప్రత్తిపాడులో సెయింట్ జోసెఫ్స్ ప్రాథమిక పాఠశాలను నెలకొల్పింది. సువిశాల ప్రాంగణంలో పక్కా భవనాలతో నెలకొల్పిన ఈ పాఠశాలకు అప్పట్లో ప్రభుత్వ సాయంతో ఎయిడెడ్ స్కూలుగా మార్పు చెందింది. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉన్నాయి. పాఠశాలను నిర్వహించలేమంటూ యాజమాన్యం నిస్సహాయత వ్యక్తం చేయడంతో, ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి మూసివేశారు. ఇక్కడి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్ ధనలక్ష్మిని ప్రత్తిపాడు డీఎస్‌టీ ప్రాథమిక పాఠశాలకు, సీహెచ్ సూర్యావతిని వేములపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు, ఆర్ స్వప్నను వాకపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. పాఠశాల మూతపడే సమయానికి 87 మంది విద్యార్థులుండగా, సుమారు 70 మందిని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో చేర్పించినట్టు ఎంఈఓ తెలిపారు.

ముగిసిన ఎన్‌సీసీ శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ఎన్‌సీసీ శిబిరం మంగళవారం ముగిసింది. రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి 480 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు కళాశాల వైస్ చైర్మన్ ఎస్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 3ఏ గర్ల్స్ బెటాలియన్‌కు చెందిన కల్నల్ దుష్యంత్ కుల్ శ్రేష్ట ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేశారు.

సాగుకు భరోసా

- రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు
- జగ్గంపేటలోని అగ్రి ల్యాబ్‌తో అన్నదాతలకు ప్రయోజనాలు


జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న అగ్రి ల్యాబ్

జగ్గంపేట: రుతు పవనాలు దాదాపు వచ్చేశాయి. మరికొన్ని రోజుల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకుంటాయి. ఈ నేపథ్యంలో రైతులు తాము సాగు చేసే వరి విత్తనాలు, వాడే ఎరువుల నాణ్యతను ఒక్కసారి తెలుసుకుని సాగు చేసుకుంటే నష్టాలు దాదాపు తప్పినట్టే. జగ్గంపేట, పరిసర మండలాల వారికి జగ్గంపేటలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ అందుబాటులో ఉంది. రైతులు తెచ్చే విత్తనాలు, ఎరువులను ఇక్కడ ఉచితంగా పరీక్షలు చేయించి, వాటి నాణ్యత, వాటి వల్ల మేలు కలుగుతుందా, లేదా తెలుసుకోవచ్చు.

జగ్గంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఉంది. 2021లో ప్రారంభించిన ఈ ల్యాబ్ ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తున్నట్టు అగ్రి ల్యాబ్ ఇన్‌చార్జి జీబీ కరుణాకర్ రాజు తెలిపారు. ప్రధానంగా రైతులు బయట కొనుగోలు చేసిన విత్తనాలు, రైతు భరోసా కేంద్రాల్లో కొన్న విత్తనాలను సాగు చేసే సమయంలో ల్యాబ్‌లో పరీక్షలు చేయించడం వల్ల నష్టపోకుండా ఉంటారని ఆయన చెప్పారు.

పరీక్షలు చేయించుకోవడం ఇలా..

రైతుల అగ్రి ల్యాబ్‌కు తాము సాగు చేయబోయే అర కేజీ వరి విత్తనాలు, అర కేజీ ఎరువులు తేవాలి. రైతులు వాడే ఎరువుల్లో పోషకాలు ఉండాల్సిన స్థాయిలో ఉన్నాయా లేదా అనేది ల్యాబ్ బాధ్యులు రైతులకు తెలియజేస్తారు. దీనివల్ల ఎరువులు వాడే విధానంలో కూడా అవసరం మేరకు మాత్రమే ఉపయోగించే వీలుంటుంది. విత్తనాలు, ఎరువులు నాలుగు రకాలుగా పరీక్షలు జరుపుతారు. మొదటిది నియోజకవర్గ పరిధిలోని విత్తనాలు, అమ్మే డీలర్లు, కంపెనీల వద్ద నుంచి మండల వ్యవసాయ అధికారులు సేకరించి పరీక్షలు చేయిస్తారు. రెండోది రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసే విత్తనాలను సేకరించి పరీక్షలు చేస్తారు. మూడోది రైతులు సేకరించుకున్న విత్తనాలకు పరీక్షలు చేస్తారు. నాలుగోది డీలర్లు, కంపెనీల వారే స్వయంగా అమ్మబోయే విత్తనాలను పరీక్ష చేయించుకుంటారు. అప్పుడు మాత్రమే వాటిని రైతులకు విక్రయిస్తారు. ఈ విధంగా రైతులకు ఎటువంటి ఇబ్బంది విత్తనాల వల్ల కానీ, ఎరువుల వల్ల కానీ రాకుండా అన్ని చర్యలూ వ్యవసాయ అధికారులు తీసుకుంటారు.

డీలర్లు, కంపెనీలకే చార్జీలు

రైతులు స్వయంగా తెచ్చుకుని పరీక్షలు చేయించే వాటికి ఎటువంటి ధర తీసుకోరు. డీలర్లు, కంపెనీల వారు పరీక్షలు చేయించుకుంటే వాటికి ధరలు నిర్ణయించి తీసుకుంటారు. రైతులకు విత్తనాలు ఈ విధంగా పరీక్షలు చేసి ఇవ్వడం వల్ల వారికి ఎటువంటి కేళీలు లేకుండా, మంచి దిగుబడి వచ్చేందుకు అవసరమైన విత్తనాలు పొందేందుకు అవకాశం ఉంటుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అగ్రిల్యాబ్ ఇన్‌చార్జి కరుణాకర్ రాజు కోరారు.


మొలకెత్తిన వరి వంగడాలను పరిశీలిస్తున్న అధికారులు


అగ్రి ల్యాబ్‌లో విత్తనాల పరీక్షలు చేస్తున్న అధికారులు

వైఎస్ జగన్‌తో చంటిబాబు భేటీ


తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు భేటీ అయ్యారు. ఎన్నికల అనంతరం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినట్టు చంటిబాబు చెప్పారు. ఆయనతో పాటు జగ్గంపేటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

నేటి నుంచి సాయంత్రమూ నీటి సరఫరా

తుని: ప్రస్తుతం వాతావరణం సాయంత్రం చల్లగా ఉన్నందున బుధవారం నుంచి రెండు పూటలా తాగునీటి సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా రెండు నెలల పాటు ఒక పూట మాత్రమే సరఫరా చేశామని చెప్పారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మంచినీరు వస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండుతున్న ఎండలతో బెంబేలు


తుని మండలం ఎస్.అన్నవరంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

- ఉక్కపోత, విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

తుని రూరల్: రుతు పవనాలు ప్రవేశించినప్పటికీ తుని ప్రాంతంలో వర్షాలు కురవడం లేదు. తొలకరి జల్లులు పడకపోగా, మండుతున్న ఎండలతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. మరోవైపు తరచూ విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయంతో జనం ఇళ్లలో సైతం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం రాష్ట్రంలోనే గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదైంది. మంగళవారం సైతం 39 డిగ్రీలు నమోదవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే భానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తుండడంతో, రోడ్లపైకి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీంతో గ్రామాల్లో రహదారులు జన సంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు ఎండవేడిమికి తట్టుకోలేక వాహనాలను రోడ్లపక్కన నిలిపివేసి, వాతావరణం చల్లబడే వరకూ విశ్రాంతి తీసుకుంటున్నారు. మండలంలో తేటగుంట, డి.పోలవరం, ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, హంసవరం, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. వాతావరణ శాఖ ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించినప్పటికీ, ఈ ప్రాంతంలో చినుకే కరువైంది. వర్షాలు కురిసి వాతావరణం చల్లబడాలని గ్రామీణులు, వర్షాలు కురిస్తే తొలకరి వ్యవసాయ పనులు చేపట్టేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులను సర్టిఫికెట్లతో సత్కరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కిర్లంపూడి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జగ్గంపేట ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురం, ఎస్ఆర్ పాలెం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం సెక్టార్ సూపర్‌వైజర్ పి.బూసమ్మ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులను సర్టిఫికెట్లతో సత్కరించి, స్థానిక ఎలిమెంటరీ పాఠశాలల్లో చేరుస్తామన్నారు. అలాగే మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులను కోరుతామన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

వేడిగా.. చల్లగా..

గోకవరం: మండలంలో మంగళవారం వాతావరణం ఉదయం వేడిగా, సాయంత్రం చల్లగా మారింది. ఉదయం భానుడు చండ ప్రచండంగా నిప్పులు కురిపించాడు. ఎండ వేడిమికి ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం ఐదు గంటల నుంచి వాతావరణం మారింది. ఆకాశం మొత్తం మేఘావృతమై చల్లని గాలులు వీచి, చిరుచల్లులు కురిశాయి. దీంతో ప్రజలు వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం పొందారు.

భారీ అన్నదానం

గోకవరం: రాజమహేంద్రవరం–గోకవరం మార్గంలో ప్రధాన రహదారి చెంత ఉన్న బాపనమ్మ ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదానం జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన వారు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ నేతలు తీరు మార్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

- ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే వరుపుల

ఏలేశ్వరం: టీడీపీ నేతలు తమ తీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు హితవు పలికారు. లింగంపర్తి పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై టీడీపీ నేతల రాద్ధాంతంపై పట్టణంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ టీడీపీ నేతలు చట్టప్రకారం కాకుండా, తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నాయకులు ప్రవర్తించడం సరికాదన్నారు. టీడీపీ నేతలు తమ పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే వరుపుల మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉందని, దానిని టీడీపీ నేతలు చెడగొట్టవద్దన్నారు. గతంలో తనతో పాటు అనేక మంది ఎమ్మెల్యేలుగా పనిచేసినా తప్పుడు విధానాలు అవలంబించలేదన్నారు. టీడీపీ నేతలు ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజేశ్వరి, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి

శంఖవరం: రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు బి.హరి వర్తకులను హెచ్చరించారు. మండలంలోని కత్తిపూడిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అలాగే రిజిస్టర్లు, బిల్ బుక్‌లను, గొడౌన్లలో ఉన్న స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు ప్రభుత్వం పెట్టిన ధరలకే రైతులకు అమ్మాలని సూచించారు. ఎప్పటికప్పుడు షాపులో స్టాక్‌ను వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. ధరల పట్టిక షాపు ముందు కనపడేలా ఏర్పాటు చేయాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు అమ్మితే షాపు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట వ్యవసాయాధికారి పి.గాంధీ, టెక్నికల్ వ్యవసాయాధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


కత్తిపూడిలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న బి.హరి

రైతులు విత్తన శుద్ధి పాటించాలి

గండేపల్లి: వరి విత్తనాలు చల్లేందుకు ముందుగా రైతులు మొలక శాతం తెలుసుకుని, విత్తన శుద్ధి తప్పక పాటించాలని వ్యవసాయాధికారి సద్గురుమూర్తి రైతులకు సూచించారు. మండలంలోని యర్రంపాలెంలో మంగళవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి కోసం 8 గ్రాముల సూడోమోనాస్ కానీ, కార్బండిజమ్ 3 గ్రాములు కానీ కేజీ విత్తనాల్లో కలిపి చల్లుకోవాలన్నారు.

కార్మికులకు అండగా ఐఎఫ్‌టీయూ

జగ్గంపేట: కార్మికుల రక్షణ, హక్కుల కోసం పోరాడేది ఐఎఫ్‌టీయూనే అని టైల్స్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు మరికుర్తి ఏసు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పెంకు కార్మికుల హక్కులు, సౌకర్యాలు, వేతనాల కోసం కామ్రేడ్ ముక్తార్ పాషా స్థాపించిన యూనియన్ ద్వారా సాధించినట్టు పేర్కొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించండి

- అధికారులతో ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, డీపీఓ కె.భారతి సౌజన్య ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోను తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు.అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, వీధిదీపాల సమస్యలపై డీపీఓ సౌజన్యతో చర్చించారు. జగ్గంపేట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంజీ, పంచాయతీ అధికారి చిరంజీవి రాజు, జువ్వల ప్రకాష్, టీడీపీ నేతలు ఉన్నారు. ఇలాఉండగా ఎమ్మెల్యే జ్యోతులను గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి మర్యాదపూర్వకంగా కలిశారు.


జగ్గంపేటలో ఎమ్మెల్యే నెహ్రూకు అభినందనలు తెలుపుతున్న డీపీఓ సౌజన్య

ట్రై సైకిల్ అందజేత

గోకవరం మండలం దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు అడబాల సింగరయ్యకు చార్జిబుల్ ట్రై సైకిల్‌ను ఎమ్మెల్యే నెహ్రూ జగ్గంపేటలో అందజేశారు.జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సహాయ సంచాలకులు నరసింహమూర్తి ఈ ట్రై సైకిల్‌ను సమకూర్చారు. జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు అప్పన్న దొర, పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

స్వార్థపు ఊబిలో పొలాలు

- కనుమరుగయ్యే దుస్థితిలో పంటలు
- వ్యాపారాలకు అనువుగా మారుతున్న వైనం
- అనుమతులు లేకుండానే మెరకవుతున్న భూములు
- హైవే వెంబడి ప్రాంతాలే టార్గెట్!


మల్లేపల్లి శివారు కరుణకుమార్ ధాబా సమీపంలో హైవేను అనుకుని మట్టితో నింపిన పొలం

గండేపల్లి: పుష్కలంగా ఏడాదికి రెండు పంటలు పండుతున్న పొలాలను వ్యాపార రంగాలకు అనుగుణంగా మార్చేస్తున్నారు. దీనిపై కనీస చర్యలు చేపట్టని అధికారులు మాకెందుకులే అన్నట్టుగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు అతిక్రమిస్తూ.. ఖరీఫ్, రబీ పంటలు పండే భూముల్లో పోలవరం, పుష్కర కాలువల వెంబడి ఉన్న మట్టిని తరలించి నింపేస్తున్నారు. హైవే వెంబడి ఉన్న పొలాలనే వ్యాపారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇదే పద్ధతి కొనసాగితే.. కాలక్రమేణా కొన్నాళ్లకు పంటలు పండే భూములు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి తప్పదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారాలను అనువుగా పొలాలు


మండలంలోని తాళ్లూరు, బొర్రంపాలెం, మల్లేపల్లి, గండేపల్లి, మురారి గ్రామాల శివారుల్లో రహదారి వెంబడి పొలాలను వ్యాపారాలకు అనువుగా మార్చేస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు అధికారులు అనుమతులు తప్పనిసరి. వారి అండదండలతోనే నింబధనలను తుంగలో తొక్కి, గుట్టుచప్పుడు కాకుండా పనులు సాగిస్తున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి ఎటువంటి రుసుములు చెల్లించకుండా, రేయింబవళ్లు తేడా లేకుండానే పంట భూములను వ్యాపారాలకు అనువుగా మార్పులు చేస్తున్నారు.

అధిక సొమ్ము ఆశచూపి..

హైవేని ఆనుకుని ఉన్న భూములకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో సంబంధిత యజమానులకు అధిక సొమ్ము ఆశచూపిన వ్యాపారులు.. ఎటువంటి అనుమతులు లేకుండానే ధాబాలు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర కట్టడాలు నిర్మిస్తున్నారు. నీలాద్రిరావుపేట, జెడ్ రాగంపేట, సుబ్బయమ్మపేట తదితర గ్రామాలకు సమీపంలోని ఆయుకట్టు చెరువుల నుంచి రాత్రివేళల్లో మట్టిని యంత్రాల సాయంతో తవ్వి, ట్రాక్టర్లు, లారీల్లో గ్రామ వీధుల్లోంచి తరలిస్తుండడం నిత్యం కనిపిస్తూనే ఉంటుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

సాగులో ఉన్న భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు పొందాలి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించి, ఆయకట్టు రైతుల నుంచి ఆమోదం తీసుకోవాలి. కొందరు అధికారుల అండదండలతో అవేమీ పట్టించుకోకుండా పనులు సాగిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సుబ్బయమ్మపేట వెళ్లే మార్గంలో చెరువులో మట్టిని తవ్వగా, ఏర్పడిన గోతులు

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయమాధవి

కోటనందూరు: రక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయ మాధవి ఆదేశించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం అంశాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో లీకుల సమస్య ఉంటే తక్షణమే పరిష్కరించాలన్నారు. నిబంధనల మేరకు రిజర్వాయర్లను శుభ్రం చేయాలన్నారు. వివిధ దశల్లో నీటిని పరీక్షించిన తర్వాతే విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పల్లెల్లో నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి, డయేరియా లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ప్రజలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్ పాల్గొన్నారు.

నూరు శాతం రికవరీ చేయాలి

గండేపల్లి: మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి పొదుపు, రుణాలు, స్త్రీ నిధి సకాలంలో బ్యాంకులకు చెల్లించేలా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని ఏపీఎం సన్యాసిరావు ఈసీ, సీసీ, వీఓఏలకు సూచించారు. గండేపల్లిలో మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోను సంఘాల నుంచి రికవరీలు నూరు శాతం ఉండాలని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలను పరిష్కరించండి

గండేపల్లి: గ్రామాల్లో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓ హనుమంతరావు వివిధ శాఖల అధికారులకు నిర్దేశించారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు, శానిటేషన్, వీధిదీపాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఎలక్ట్రికల్, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.